# మెల్లేకాదు; సర్వం కల్ల

**-భమిడిపాటి సోమయాజి**

అక్షయమూర్తికి అయిదుగురు ఆడపిల్లలు. ముగ్గురికి పెళ్ళిళ్ళు చేసేశాడు. ఇంకా యిద్దరున్నారు. ప్రస్తుతం నాలుగో పిల్ల పెళ్ళి ప్రయత్నంలో వున్నాడు. మొదటి ముగ్గురికి అమెరికా సంబంధాలే చేశాడు. ఈ నాలుగో పిల్లకి కూడా అమెరికా సంబంధమే ప్రయత్నం చేస్తున్నాడు. అమెరికా సంబంధాలు చెయ్యలేని ఆడ పిల్లల తల్లులు, యీ అక్షయమూర్తి అమెరికా సంబంధాలు సులువుగా ఎలా చేస్తున్నాడని ఆశ్చర్యపడుతూ, అక్షయమూర్తిని చూసి నేర్చుకోమని తమ తమ మొగుళ్ళని మందలిస్తూంటారు.

అక్షయమూర్తి తన ఆఫీసర్ని ఒక నెల సెలవు ఇమ్మని అడిగాడు. "ఏమిటయ్యా నీ రిటైర్‌మెంట్ దగ్గర కొస్తూంటే సెలవంతా వాడేస్తున్నావు. ఆఖరికి 'లీవ్ ఎన్‌కేష్‌మెంట్' బాపతు డబ్బులు సున్నా అయిపోయి నష్టపోతావు జాగ్రత్త!" అన్నాడు ఆఫీసర్.

"ఫర్వాలేదు సార్! లెఖ్ఖలు వేసి చూస్తే లీవ్ అయిపోయినా నేను లాభంలోనే వుంటాను. మా నాలుగో అమ్మాయి పెళ్ళి చేద్దామని సెలవు అడుగుతున్నాను."

"అవునయ్యా! ముగ్గురి పిల్లలకి అమెరికా సంబంధాలే చేశావుట. నీ పేరులో మొదటి అక్షరం 'అ' అవడం వలన అన్నీ అమెరికా సంబంధాలే చెయ్య కలుగుతున్నావని ఆఫీసులో వాళ్ళంటున్నారు."

"ఆ! అదేం లేదండీ మీలాంటి పెద్దల ఆశీర్వచనం!" ఈ వినయానికి మురిసిపోయిన ఆఫీసర్ అక్షయమూర్తికి ఒక నెల సెలవు ఇచ్చాడు.

ఆరోజు నుంచే సెలవు శాంక్షన్ చేయించుకున్న అక్షయమూర్తి "మరి నేను సెలవు తీసుకుంటాను సార్" అని ఆఫీసర్ గదిలోంచి బయటపడి సరాసరి శీఘ్ర వివాహాల సెంటర్‌కి వెళ్ళాడు. అక్కడ మేనేజర్ కొన్ని సంబంధాల వివరాలు ఇచ్చాడు. ఈ అమలాపురం ఆముదాలవలస మొదలైన దేశవాళీ సంబంధాలు వద్దు. ఈరోజు నా సెలవు మొదలైపోయింది. నా టైమ్ పాడుచెయ్యకండి. అమెరికాలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావాలి. అందులో చాలా తక్కువ రోజులు ఇండియాలో వుండి పెళ్ళి చేసుకుని మళ్ళీ అమెరికా చెక్కేసే డైనమిక్ యువకులు కావాలి.

"యువకులంటే ముప్ఫై ఏళ్ళయినా ఫర్వాలేదా సార్!"

"ముప్ఫై అయిదయినా ఫర్వాలేదు! అమెరికా డాలర్లు నలభై ఏళ్ళొచ్చిన పెద్ద పిల్లల్ని కూడా యువకుల్లా వుంచుతాయి. డబ్బు పుష్టి అటువంటిది" అన్నాడు అక్షరమూర్తి.

"సార్ మీరు బలే మాట్లాడుతున్నారు"

"సర్లే ఇదివరకే యీ విషయం చాలామంది చెప్పారు నాకు" అంటూ ఆ మేనేజర్ ఇచ్చిన ఒక ఫొటో అందుకున్నాడు.

ఆ ఫొటో చూస్తుంటే "యీ పిల్లాడు యింక యిరవై రోజులే ఇండియాలో వుంటాడు. పెళ్ళి చేసుకుందామని యిదివరలో నాలుగుసార్లు వచ్చి, రిక్త హస్తాలతో వెళ్ళిపోయాడు" అన్నాడు మేనేజర్.

"ఎందుకు వెళ్ళడూ! యీ పిల్లాడి ఎడం కన్ను కొంచెం మెల్ల కదూ! అందుకే పెళ్ళవడం లేదు" అన్నాడు అక్షయమూర్తి.

ఇంతలో ఫోన్ మోగింది. "అదిగో గంట మోగింది. నే చెప్పింది సత్యమే" అన్నాడు అక్షయమూర్తి.

ఫోన్ అందుకున్న మేనేజర్ అంటున్నాడు, "మేమేం చేస్తాం సార్. వచ్చిన ప్రతీవాళ్ళకీ మీ అబ్బాయి ఫోటో చూపిస్తున్నాం. సంబంధం కుదరకపోతే మాదా బాధ్యత. ఇదుగో యిప్పుడే ఒకాయన చూసి పిల్లాడికి ఎడం కన్ను మెల్ల అన్నారు"

"మా వాడికి వంకలు పెడతాడే? మావాడి కళ్ళు చక్రాల్లా వుంటాయి. ఆ మెల్ల అన్న మాట కల్ల" అని ఫోన్ ఆయనకి యిమ్మని గట్టిగా అరిచాడు.

మేనేజర్ ఒణుకుతూ ఆ ఫోన్ అక్షయమూర్తికి యిచ్చాడు.

అక్షయమూర్తిని అదరగొట్టబోయాడు ఆ పిల్లాడి తండ్రి. కాని అక్షయమూర్తే ఆయన్ని అదరగొట్టాడు.

"అది కాదు సార్. లేనివి వున్నట్టు చెప్పే వంశం కాదు మాది. బాగా పరీక్షగా చూస్తేకాని మీ అబ్బాయికి మెల్ల వుందని తెలీదు. నేను వేద పరీక్షాధికారి కొడుకుని" అన్నాడు అక్షయమూర్తి.

అంతే! వేద పండిత కుటుంబంలోని వాళ్ళు తన పిల్లాడి ఫొటో చూడడమే గొప్ప అదృష్టం అని మురిసి పోయిన పిల్లాడి తండ్రి, తాతాలుగారు వెంటనే శీఘ్ర వివాహాల సెంటర్‌కి వచ్చి, అక్షయమూర్తిని కలిసి విషయాలు మాట్లాడి ఆ మర్నాడు దశమినాడు మిగిలిన విషయాలు మాట్లాడదామని చెప్పి యింటికి చక్కా పోయారు.

❖ ❖ ❖

ఆ మర్నాడు అక్షయమూర్తి తాతాలుగారి యింటికి వెళ్ళి, తన కూతుర్ని వచ్చి చూడమని ఆహ్వానించాడు.

జాతకాలు చూసి, పిల్లని చూసి పిల్లాడికి నచ్చిందని చెప్పడానికి నాలుగు రోజులు పట్టింది. "పిల్లాడికి పిల్ల నచ్చిందికాని, మరి పిల్లేమో పిల్లాడికి మెల్ల అంటోం దని" చెప్పాడు అక్షయమూర్తి.

తాతాలుగారికి కోపమొచ్చింది. ఈ మెల్ల కల్ల అని అంతకు ముందే చెప్పాను. మీకిష్టం లేకపోతే మా సంబంధం వదిలెయ్యండి" అన్నారు గట్టిగా.

పిల్లాడు అమెరికా వెళ్ళడానికి యింక పదిరోజులే వ్యవధి! పిల్లాడు చూస్తే "యీసారయినా పాణిగ్రహణ యోగం వుందా లేక రిక్తహస్తాలతో అమెరికా వెళ్ళి పోవాలా" అనే దిగాలు పడిపోయాడు. పైగా ఆ అక్షయ మూర్తి కూతురు తనకి నచ్చిందని సిగ్గు విడిచి చెప్పాడు.

అసలు వీడికి మెల్ల వుందని యిప్పటివరకూ మనకెందుకు తెలీలేదని యింట్లో వాళ్ళు గోల!

ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేక పిల్లని ఒకసారి వచ్చి పిల్లాడ్ని చూసుకోమని కబురు పంపారు.

పిల్లాడికి పెళ్ళిచూపులు జరిగాయి. వాడికి చెప్పారు "పిల్లని ప్రత్యక్షంగా చూడకు! ఆ పిల్ల నీకు మెల్ల అని ఖాయం చేస్తే, యీ సంబంధం కాస్తా అటక ఎక్కే స్తుంది. నువ్వు అమెరికా విమానమెక్కేస్తావు!"

పిల్లాడు వినయ విధేయతలతో ఒదిగి ఒదిగి కూర్చున్నాడు.

"మరీ అంత ఒదిగి కూర్చోకు. ఈసారి మెల్లకి గూని కూడా జతచేస్తారని" సంజ్ఞలతో చెప్పారు ఆ పిల్లాడికి.

మళ్ళీ పెళ్ళి చూపులయిపోయాయి. రెండు రోజుల వ్యవధిలో తెలియపరుస్తామన్నాడు అక్షయమూర్తి. పిల్లాడు అమెరికా వెళ్ళడానికి యిక ఎనిమిది రోజులే గడువుంది.

❖ ❖ ❖

అక్షయమూర్తి ఒకరోజు పొద్దున్న ఏడు గంటలకే వచ్చి తాతాలుగార్ని కలిశాడు.

"అయ్యా! తాతాలుగారూ మీలో మా తాతగారి పోలికలున్నాయి. మీరేమో ఆ మెల్ల కల్ల అంటున్నారు. మద్రాసులో పెరిగిన మా అమ్మాయేమో పిల్లాడి కంట్లో ఎల్లా మెల్ల అంటోంది. నేను మా అమ్మాయికి నచ్చ చెప్పాను. ఎవరైనా మెళకువగా వున్నప్పుడే కదా కళ్ళు తెరుచుకుంటారు. నిద్రపోయేటప్పుడు ఎలాగూ మెల్ల కనపడదు. అబ్బాయి పగలంతా ఆఫీసులోనే వుంటాడు కనుక పగలు ఆ మెల్ల నువ్వెలాగా చూడవు మొత్తంమీద ఆ మెల్లకన్ను నీ కంటపడేది చాలా తక్కువ టైమే కదా! ఈ సంబంధం చేసుకోమని నచ్చచెప్పి ఒప్పించాను."

"అది కాదు అక్షయమూర్తిగారూ, అసలు మా వాడికి మెల్ల..."

"ఇక వదిలెయ్యండి బాబూ తాతాలుగారు. పిల్లాడి ఫ్లైట్‌కి టైమ్ అయిపోతోంది" అని చెపుతూ కట్నం యివ్వలేనని చెప్పాడు.

ఇదే విషయం శ్రీమతి తాతాలుగారు తెలుసుకుని "కట్నం పోతే పోయింది. లాంఛనాలు ఏం జరిపిస్తారో" అడగమంది.

## నాయకులు

వాగ్దానాలు మిన్న
చేతలు సున్న

## దోపిడి

విషవాయువులాంటిది
సమాజాన్ని
పాడు చేస్తుంది

## ఆడపిల్ల

ఎందుకో
అంత ఛీత్కారం
ఆమె లేకపోతే
నీకు జన్మేది

## అమ్మా! అమ్మా

అది పిలుపు కాదు
పేదోళ్ళ
ఆకలి కేకలు

–రాయప్రోలు వామనమూర్తి

లాంఛనాలు యథాశక్తి జరిపిస్తానన్నాడు అక్షయ మూర్తి.

శ్రీమతి తాతాలుగారికి మంటెక్కింది. "యథాశక్తి చెయ్యడానికి యిదేమైనా దేవుని పూజాండి" అని అక్షయమూర్తిని అడిగింది.

"అదికాదమ్మా! మరి డబ్బు సమకూర్చుకోవడానికి వ్యవధి లేదు కదా. అసలు ఆ మెల్ల గొడవలోనే కొంత కాలయాపన అయిపోయింది" అన్నాడు అక్షయమూర్తి.

ఈ మెల్ల ప్రస్తావన వచ్చేసరికి పెళ్ళికొడుకు "అమ్మా" అంటూ, యీ సంబంధం కాస్తా పోతుందేమో నన్న భయంతో తన తల్లిని లోపలికి పిలిచాడు.

ఏదో ఒకటి జరిపించమను. ఆడపడుచు లాంఛ నాలు నేనే ఒక లక్షరూపాయలిస్తానన్నాడు.

మొత్తంమీద లాంఛనాలు కూడా నామమాత్రంగా జరిపించడానికి ఒప్పుకున్నారు.

పైగా, రెండ్రోజుల తర్వాత వచ్చి, వ్యవధి తక్కువ అవడం వలన ఫంక్షన్ హాలు కుదరలేదని, పెళ్ళి తన యింటి దగ్గర శోభాయమానంగా విద్యుద్దీపాలతో చేస్తానన్నాడు అక్షయమూర్తి.

"ఇంటి దగ్గర పెళ్ళేమిటి? వచ్చే పోయే ట్రాఫిక్ మధ్యన" అంది శ్రీమతి తాతాలుగారు.

"మా యిల్లు డెడ్ ఎండ్‌లో వుంది. ట్రాఫిక్ అంత రాయం వుండదు" అన్నాడు అక్షయమూర్తి.

తాతాలుగార్ని లోపలికి పిలిచి "డెడ్ ఎండ్" అంటే ఏమిటి అని అడిగింది ఆయన శ్రీమతి.

విసిగిపోయిన తాతాలుగారు "చావు చివర" అని ఆ యింగ్లీషు అప్రాచ్యపు ముక్కల్ని తెలుగులోకి తర్జుమా చేసి చెప్పారు.

ఈ "చావు చివర" అన్న మాటలు విని, ఈ పెళ్ళి శుభాశుభాల సమ్మేళనం అయింది కాబోలు అనుకుంది శ్రీమతి తాతాలుగారు.

ఏదైనా అడుగుదామంటే అబ్బాయి ఫ్లైట్‌కి టైమ్ అయిపోతుందని నోరు మూసుకు కూర్చుంది ఆవిడ.

బంగారపు వస్తువులు చేయించడానికి వ్యవధి లేదని చెప్పి అబ్బాయి అమెరికా నుంచి తెచ్చిన "అమెరికన్ డైమండ్ నెక్లెస్", "తర్వాత చూసుకుందాం" అని చెప్పి, శ్రీమతి అండ్ శ్రీ తాతాలుగారికి తెలియకుండా పెళ్ళికొడుకు నుంచి స్వీకరించాడు అక్షయమూర్తి.

మొత్తంమీద ఎన్నో సంవత్సరాల నుంచి, చాలా ఘనంగా జరుగుతుందని ఎదురుచూసిన పెళ్ళిని తుస్సుమనిపించాడు అక్షయమూర్తి.

ఇలా తొణక్కుండా, బెణక్కుండా పెళ్ళి చేసిన కన్యా దాతని, యికముందు చూడబోమని, ముక్కుమీద వేలేసుకున్నారు మగపెళ్ళివారు.

❖ ❖ ❖

సెలవు ముగించుకుని ఆఫీసుకి వచ్చిన అక్షయ మూర్తిని అభినందిస్తూ, "మీ ఆఖరి పిల్లతో బాటు, మా అమ్మాయికి కూడా ఒక అమెరికా సంబంధం చేసిపెట్టవయ్యా" అని అడిగాడు ఆఫీసర్.

"అయ్యో! అదెంతపని"

"నువీ ఒక్క వుపకారం చేస్తే చచ్చి నీ కడుపున పుడతాను" అన్నాడు ఆఫీసర్.

"పుట్టండిగాని, ఆడపిల్లగా మాత్రమే పుట్టండి. వచ్చే జన్మలో మీక్కూడా అమెరికా వరుడ్నే తీసు కొస్తాను"

"అసలు నీ టెక్నిక్ ఏమిటో చెప్పుదూ"

"ఏముందీ.. వెరీ సింపుల్! ఇండియాకి కేవలం పెళ్ళి చేసుకోవడానికి వచ్చి, మళ్ళీ అమెరికా వెళ్ళి డాలర్లు ఎప్పుడు సంపాదిద్దామా అని ఆతృతతో సతమతమయ్యే వ్యవధిలేని పిల్లాడ్ని పట్టుకుని, అతనికి లేని లోపమొకటి అంటకట్టడమే" అన్నాడు అక్షయమూర్తి.

"నీలాంటి మేధావులు, మన దేశం వదిలి అమెరికా వెళ్ళకపోవడం నాలాంటి అమాయకులకి చాలా లాభ మయ్యా" అన్నాడు ఆఫీసర్. ■

## మట్టిగడ్డ మనోగతం

సామాన్యుడయినా - మాన్యుడయినా
నాలో పండిన పంటే తినాలి
ఆకాశంలో ఎగిరినా నా మీదే దిగాలి
నా ఒంటిమీద గీతలు గీసి- అక్షాంశాలు
రేఖాంశాలని పేరుపెట్టినారు. వీటి మధ్య
నా దేశం- నీ దేశం అని ఆంక్షలు పెట్టినారు
కోట్లు ఖర్చుపెట్టి వీటికి కాలపా కాస్తుంటారు
అవసరమయితే ప్రాణాలిస్తారు
ఆఖరికి అందరూ నాలో కలుస్తారు
నా ఒడిలో సేదతీరుతారు.

-బి.యం.పి.సింగ్